ఆఫీసు అవగానే ఇంటికి బయల్దేరాను... ఉదయం శ్రీమతి చెప్పినట్టుగానే కూరగాయలు తీసుకుని.

వెలుగు రేఖల సైన్యాన్ని పారద్రోలి నియంతలా వచ్చి స్థిరపడిపోతున్న నిశీధి పాలనకి అలవాటైపోతున్నట్టు అందరూ గుడ్డి దీపకాంతుల్లో పనులు పూర్తిచేసుకుంటూ ఇంటి ముఖం పడుతున్నారు.

ఎప్పుడెప్పుడు • అమృతను చూద్దామా... ఎప్పుడు తన ఒడిలో సేద దీరుదామా అన్నట్టు బండిని ఇంకా స్పీడ్‌గా నడిపించాను.

మరో పది నిముషాలకి... నా బండి హారన్ శబ్దానికి

# అమృతానందం



-బి. గీతిక

తలుపులు తీసి గుమ్మంలోంచి వరండాలోకి వచ్చింది అమృత. పేరుకు తగ్గట్టు అమృతలో అంతా అమృతమే. మాట అమృతం, చూపు అమృతం, మనసు అమృతం...

లోనికి వెళ్ళిపోతున్నదల్లా- ఏదో లోకంలో ఉన్నట్లున్న నన్ను చూసి, "ఏంటీ...ఆలోచిస్తున్నారు...?" అని అడిగింది.

కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళిచ్చి, నా చేతిలోని కూరకాయల సంచీని అందుకుంది.

కాళ్ళు కడుక్కొని తన చీర కొంగుతో చేతులు తుడుచుకున్న తర్వాత పనిలోపనిగా ఆ చీర కొంగుతోపాటూ నా చేతుల్నీ తన నడుముకు చుట్టాను.

"అబ్బా...? ఏమిటిది? ఎవరైనా చూస్తారు. వదలండి" అంటూనే నా చేతుల పట్టు తప్పించుకుని ఇంట్లోకి నడిచింది.

నేనూ తనని అనుసరిస్తూ ఇంట్లోకి అడుగుపెట్టగానే తలుపు మూసేసి గట్టిగా తనని చుట్టేశాను.

"ముందు స్నానంచేసి రండి." అంటూ కూరగాయల్తో సహా వంట గదిలోకి వెళ్ళబోతున్న అమృతని పట్టి, మీదకు లాక్కుని, "చేయొచ్చు- లేవోయ్. ముందీ పని అవనీ..." అన్నాను.

"ఊహు... భోం చేశాక..." అంటూ నన్ను బాత్రూంలోకి తోసింది అమృత.

* * *

స్నానం చేసి, పూవుల్ని సుతారంగా తలలో పెట్టుకుంటూ బెడ్ రూంలోకి వస్తున్న అమృతని చూస్తుంటే చాలా అపురూపంగా అన్పించింది. మంచాన్ని సమీపిస్తూ ట్యూబ్‌లైటు తీసేసి, బెడ్ లైట్ వేసింది.

ప్రక్కనే నడుం వాల్చిన అమృత ముఖాన్ని చేతుల్లోకి తీసుకుంటూ "అమృతా..." అన్నాను. "ఊ..." అంటూ నా గుండెపైన తల పెట్టుకుని పడుకుంది.

చలువ పన్నీటిలో స్నానం చేసిందేమో అన్నట్టు- అమృత చల్లని మేని నుంచి అదో రకమైన పరిమళం మత్తును పూసుకొచ్చి మరీ నన్ను చుట్టుకుంది. నాకు తెలీకుండానే నా కౌగిలి బిగిసింది. ఆతృతగా, ఆవేశంగా తన ముఖమంతా ముద్దాడాను. నా వేడి శ్వాసలో గదంతా వేడెక్కిన అనుభూతి. ఏదో కావాలి... ఏదో... మరింకేదో...

ఇద్దరి మధ్యా గాలైనా చొరబడలేని గాఢ పరిష్వంగం. వేడి నిట్టూర్పుల మధ్య ఓపలేని తాపంతో తన అధరాల్లో పడి మెలి తిరుగుతూ వంపుసొంపులు పోతున్న గమ్మత్తైన పిలుపు "నందూ... ఊ..." అంటూ.

గట్టు తెగిన గోదారిలాంటి నా ఆవేశానికి అడ్డువేసిన ఆనకట్టే అయ్యింది తన తనూలత. వాడి సొమ్మసిల్లిన మల్లెలు మా ఆచ్ఛాద రహిత గుండెల మధ్య నలిగిపోయి నల్లబడ్డాయి.

సోలిపోయి ప్రక్కకు తిరిగున్న తన ముఖాన్ని నా వైపు తిప్పుకుని, సున్నితంగా ముద్దుపెట్టుకున్నాను. అలసిన శరీరానికి నా సన్నిధే స్వాంతనన్నట్టు నామీద కాలూ చెయ్యీవేసి, నా చేతి వంపులో తల దూర్చి కళ్ళు మూసుకుంది అమృత.

ఆస్వాదించిన అనుభవంలో గుండె నిండిన తృప్తి ఉన్నా... మరింకేదో లోటు స్పష్టంగా కన్పించింది నాకు.

మా పెళ్ళయి రెండు ఏళ్ళయ్యింది. అప్పుడే పిల్లలు వద్దనుకున్నాం. ఈ రెండేళ్ళలో మా మధ్య చెప్పుకోదగ్గ మనస్పర్థలేం రాలేదు సరికదా ఒకరి భావాల్ని మరొకరం అర్థంచేసుకుని నడుచుకోగలిగినంతగా కలిసిపోయాం. కొన్ని రోజుల క్రితంవరకూ ఇద్దరిలోనూ చలాకీతనం, అల్లరి, అలకలు, కొంటెదనం... కానీ... ఈ మార్పు ఎప్పుడు మొదలయిందో తెలీనే లేదు. ఏదో యాంత్రికత్వం. ఏదో...! 'ఈ పని చేశావా' అంటే 'చేశాం' అన్నట్టు. అలా అని అమృతని తప్పుపట్టలేం. నాకేం కావాలో... అన్నీ సమయానికి సమకూరుస్తుంది. ఏ విషయంలోనూ ఇసుమంతైనా నొచ్చుకోనీయదు. తను ఇమ్మంటే ప్రాణమైనా ఇచ్చేస్తుంది.

మరెందుకు...ఇద్దరి మధ్యా ఈ అగాధం...?

అర్ధరాత్రి కావస్తోంది. అమృత నిద్రపోయినట్టుంది. నాకేమో... ఆలోచన పోతేనే గానీ నిద్ర రానంటుంది. నిద్ర వస్తేనే గానీ ఆలోచన పోనంటుంది.

పెళ్లయిన కొత్తలో శేఖరం బాబాయన్నట్టు సంవత్సరానికే మొహం మొత్తేసిందా...!

"చూస్తూండు. పెళ్లయిన సంవత్సరం వరకే ఆ మోజంతా. తర్వాత్తర్వాత మొహం మొత్తేస్తుంది..." అన్న బాబాయి మాటల్ని అమృతతో చెప్పాను. అది విని తనూ నవ్వేసింది.

అప్పట్నుంచి... అది గుర్తొచ్చినప్పుడల్లా "మొహం మొత్తిందా...?" అని అడుగుతుండేది.

ఇద్దరమూ నవ్వుకునేవారం.

ఇప్పుడు ఇద్దరిలో ఏదో...అనాసక్తి. కొంపదీసి... అదే... నిజమా...

ఆలోచనల్లో పడి... ఎప్పుడు నిద్రపోయాడో ఆనంద్.

* * *

ఉదయం పదిన్నర అయింది సమయం.

మెత్తగా అల్లుకుపోయి, మెరుస్తోన్న పువ్వుల్తో నిండిన చీరలో సుమ బాలలా నడిచొస్తోంది ఆమె.

ఎత్తుకు తగ్గ లావు... పచ్చని ఛాయ... ఒత్తైన తలకట్టు... చూడగానే ఆకర్షించే రూపం.

గుడ్లప్పగించి చూస్తున్న అతన్ని సమీపించి, అప్పటివరకూ తన చేతిలో ఉన్న వేరుశనక్కాయల పొట్లాన్ని

అతని ముందుంచిందామె.

రెండు గింజలు తీసుకుని, "నీకివి ఇష్టమా..."అని అడిగాడామెను.

"నీ అంత కాదు... కొంచెం" అంది నవ్వుతూ ఆమె.

బోట్ బయల్దేరుతుండడంతో ఇద్దరూ బోట్ వైపు నడిచారు.

ఆమె చేతిలోని వేరుశనక్కాయల పొట్లాన్ని మడిచేసి తన పాంటు జేబులో వేసుకున్నాడు.

నిండుగా తొణికిసలాడుతున్న కృష్ణానది. చుట్టూ నీరు. మధ్యలో యాభై మంది ప్రయాణించగల మీడియం సైజు లాంచీ లాంటి బోటు. నదీ అలల మీంచి మంద్రంగా సాగుతున్న చల్లని పిల్లగాలి శబ్దాన్నీ మోటారులోంచి వస్తున్న శబ్దాన్ని అధిగమిస్తూ లాంచీ వేగానికి చీలిపోయిన నీరు హోరుమంటూ ఉవ్వెత్తున లేచి చిరుజల్లులై లోనున్న వారిని తడుపుతోంది. చాలా ఆహ్లాదంగా ఉందా అనుభవం.

రివ్వున వీస్తున్న గాలి వేగానికి మస్తిష్కంలోని ఆలోచనలూ ఎగిరిపోతున్నట్టు, అందరూ అన్నీ మర్చిపోయి ఆటవిడుపులా సంతోషంగా ప్రకృతిలో లీనమైపోతున్నారు.

చుట్టూ నీరు, కనుచూపుమేరలో దూరంగా కొండలూ పచ్చని చెట్లూ, మరోవైపు కొండ మీద కనకదుర్గ గుడి... వీటన్నింటినీ జన సందోహానికి దూరంగా ఉండి చూడ్డం మరో అనుభూతి.

ఎ.పి. టూరిజం నుంచి బయల్దేరిన బోటు అర్ధగంట తర్వాత కృష్ణమ్మ మధ్యలో ఆశ్చర్యకరంగా రూపుదిద్దుకున్న భవానీ ఐలాండ్ ఒడ్డున ఆగింది.

అతను బోటు దిగి ఆమెకోసం వెనక్కు చూశాడు.

గాలికి ఎగిరిపోతున్న చీరని ఓ చేత్తో ఒడుపుగా పట్టలేక, అటూ ఇటూ ఊగుతున్న బోటు ఊగిసలకి క్రిందికి దిగలేక అవస్థపడుతున్న ఆమెను చూసి చేయందించాడతను.

సంకోచంగానే అతని చేతిలో చేయి వేసిందామె.

బోటు దిగిన తర్వాత కూడా ఆ చేతిని విడువకుండానే ముందుకు నడిచాడతను.

అతను కాటేజీల వైపు అడుగులేస్తుంటే... "కొంచెంసేపు అలా చెట్ల మధ్య గడుపుదాం..." అందామె చుట్టూ అడవిలా ఉన్న ప్రకృతిని చూసి పులకించిపోతూ.

"సరే...పద..." అని ముందుకు నడిచాడతను.

జామాయిలు, టేకు, వెదురు, జామ, అశోక చెట్లు... ఒకటని లేదు... ఎన్నెన్నని...! ఆకాశంలోకి చొచ్చుకుపోయినట్లు అంతెత్తున ఎదిగి ఎండ పొడని నేలమీద పడనీయట్లేదవి. అక్కడక్కడా పెద్ద పెద్ద చెట్లు చుట్టూ పదడుగుల మేరా సిమెంటుతో దిమ్మల్లాగా కట్టించి ఉన్నాయి. చెట్ల మీదున్న రకరకాల పక్షుల అరుపులు సప్తస్వరాల సంగీతంలా అనిపిస్తున్నాయి.

కొంత దూరం నడిచాక ఆమె నడుం చుట్టూ చెయ్యేసి నడుస్తున్న అతని చర్యని గమనించినా తనకీ నచ్చినట్టు నిశ్శబ్దంగా ఉండిపోయిందామె.

అలా నడుస్తూనే ఉన్నారు. ఎన్ని ఎకరాల స్థలమో... ఎంత నడిచినా తరగడం లేదది.

తలపుల్లో కూడా కరవైన ప్రకృతి - కనులెదుట ఇంపుగా నిండైన పచ్చదనం, అరుణ కిరణాలతో దోబూచులాడుతున్న చెట్లు, వాటిక్రిందనే పరుగుపందాలాడుతున్నట్టుగా కదలాడే వెలుగునీడలు,... ఏమని వర్ణిస్తే నయనానందకరమైన ప్రకృతి శోభానందం- మాటలకందుతుంది.

'ఎండలో జ్వరమొస్తుంది బొజ్జోకన్నా' అంటూ మబ్బు దుప్పటి కప్పేస్తున్న ఆకాశాన్ని మభ్యపెడుతూ మధ్యమధ్యలో ఆకతాయి బుడతడిలా దుప్పట్లోంచి తొంగి తొంగి చూస్తూ కేరింతలు కొడుతున్నాడు రాలుగాయి సూరీడు.


ఎవరూ లేని ఏకాంతం... అంతలోనే 'మేమున్నాం' అంటూ తలలూపే చెట్లూ, 'మా మాటలు వినబడలేదా' అంటూ పిట్టలూ కదలి కదలి కూస్తూ మౌనం నిండిన ప్రశాంతతకి అందాన్ని ఆపాదిస్తున్నాయి.

ప్రకృతి రమణీయతతో కనులు నిండిపోగా మెల్లిగా రెప్పలు మూసుకుని అతని భుజానికి తల వాల్చిందామె.

"అక్కడ కూర్చుందామా...?" అన్నాడతను... ఆమె అలసిపోతుందేమో అన్నట్టు.

తలూపిందామె.

అతను నాప్కిన్‌తో కొంతమేరా దులిపి చెట్టుకు ఆనుకుని కూర్చున్నాడు. ఆమె అతని ఎదురుగా కూర్చోబోతుంటే "ఇలా రా..."అంటూ రెండు కాళ్ళ మధ్యలో ఆమెను కూర్చోబెట్టుకుని, ఆమె వీపును గుండెలకదుముకున్నాడు. మనసులో సంకోచంగానే ఉన్నా తనకీ బాగుండడంతో అతని మీదకు వాలిందామె.



చెవిలో జల్లుమన్నట్టుగా విన్పించిందా శబ్దం. ఆమెలో ప్రతి చర్య లేకపోవడం అతన్ని రెచ్చగొట్టినట్లయింది. లయగా విన్పించే మువ్వల శబ్దంలా ముద్దులు జారవిడుస్తున్నాడు.

ఆమె చనువు ఇస్తుందని అర్థమై ఆమెని ఇంకొంచెం దగ్గరకదుముకుని చెవి క్రిందుగా మెడ మీద ముద్దుపెట్టుకున్నాడు.

చెవిలో జల్లుమన్నట్టుగా విన్పించిందా శబ్దం. ఆమెలో ప్రతి చర్య లేకపోవడం అతన్ని రెచ్చగొట్టినట్లయింది. లయగా విన్పించే మువ్వల శబ్దంలా ముద్దులు జారవిడుస్తున్నాడు.

ఒడిలో చేర్చుకుని మీటుతున్న వీణలా అతనామెను ఆపాద మస్తకం వేలి కొసలతో తడుముతూ... తడుతూ... గుండెలోని రాగాల్ని ఆమె పెదవులపై పలికిస్తున్నాడు. అతని వేళ్ళు ఆమె ఎద శిఖరాల ఎత్తులు కొలుస్తున్నట్టు అక్కడే ఆగిపోయాయి.

ఇక ఒపలేనన్నట్టు అతన్ని గాఢంగా హత్తుకుపోయిందామె.

ఇంకా అతని కొలతలు పూర్తికాలేదేమో... ఒక్కసారిగా ఆ ఎత్తుల మీంచి జారి పడ్డట్టు క్రిందికి జారిన అతని వేళ్ళు పట్టుకోసం దొరికిన కొమ్మలా నాభిని పట్టుకుని బిగుసుకున్నాయి.

"ఏయ్..." అందామె మత్తుగా అతని మెడ చుట్టూ చేతులేసి చుట్టేస్తూ...

విడివడి గమ్మత్తుగా ఉన్న ఆమె పెదవుల్ని తనివి తీరా ముద్దుపెట్టుకున్నాడు.

"ఊహు...వద్దురా..." అంటూనే అతన్ని ఇంకా మీదకు లాక్కుందామె.

కోరిక బుసకొడుతూ ఎగసిపడే వారి తనువుల మధ్య ఇరుక్కుపోయిన నిశ్వాసాల వేడిగాలి ప్రక్కకు తప్పుకోవడానికి దారి వెతుక్కుంటోంది.

ఆ కటిక నేలే దూదిపింజెల పరుపయ్యింది వారికి.

కోడె నాగులై మెలిపడుతున్నాయి వారి తనువులు.

కసి నిండిన గండు తుమ్మెద పూయెదలోని మధువు ఆసాంతాన్ని గ్రహించేసి మత్తెక్కి ఆ పూయెద మీదే తూలి పోయినట్టు ఆమె పైయ్యెద మీద వాలిపోయాడతను బరువుగా శ్వాసిస్తూ.

అతన్ని సరిగ్గా పడుకోబెట్టి, ప్రేమగా అతని జుట్టులోనికి వేళ్ళు పోనిచ్చిందామె. తనకు అనువుగా చూసి కూర్చుంది.

"ఏంటీ... అమ్మగారిలో ఇంత ఉల్లాసం...?" అడిగాడు ఆనంద్ కొంటెగా నవ్వుతూ.

"ఏం... అయ్యగారికి మొహం మొత్తిందా?" అంది అమృత అల్లరిగా.

"ఊహు..." అని రెండు క్షణాలాగి, "కనీసం అప్పుడప్పుడన్నా ఇలాంటి ప్రకృతిలో మనసులు పంచుకుంటూ గడిపితే ముసలితనం దరిచేరినా మొహం మొత్తదెవరికీ..." అని చెప్పాడు.

"అంటే..." అర్థం అయ్యీ కానట్లనిపిస్తుంటే అడిగింది అమృత.

"చూడు. ఈరోజు నీలో ఎంత హాయో...! నిన్ను చూస్తున్న నాలోనూ ఏదో క్రొత్తదనం. నిన్నటి రోజున ఇదే ఫీలింగ్... కానీ అందులో ఏదో మిస్సయిన భావం. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టమే. మరెందుకలా...? అదే యాంత్రికత్వమేమో...! అదే వాతావరణం, అదే ఇల్లు. ఉదయం నేను ఆఫీసుకు వెళ్ళిన దగ్గర్నుంచీ సాయంత్రం నేనొచ్చేవరకూ ఒంటరిగా నువ్వు, ఆఫీసులో అందరి మధ్యా ఉన్నా నీ ఆలోచనల్తో ఏకాకిలా నేనూ... ఆ లోన్లీనెస్ ఫీలింగే రాత్రిపూట చాలాసేపటివరకూ. అలాంటప్పుడే మనసుకు క్రొత్తదనం కావాలి. మధురోహల్ని అల్లుకోవడానికి మరో మధురమైన ఆధారం వెతుక్కోవాలి. మరీ రాష్ట్రాలు, దేశాలు దాటి వెళ్ళనవసరం లేదు. దగ్గర్లోనే... ఏదైనా ఏకాంత ప్రదేశం... అదీ సహజమైన వాతావరణంలో... అప్పుడే మనసు మళ్ళీ సహజత్వాన్ని పెంచుకోనగలుగుతుంది. నువ్వు గ్రహించే ఉంటావు... ప్రస్తుతం నీ మనసులోని హాయిని. మళ్ళీ ఇదివరకటి కొంటెదనం..."అని. అతనంటూ ఉంటే సిగ్గుగా చిరునవ్వు నవ్వింది అమృత.

"ఇంతకీ మీకు... ఈ స్థలం గురించి ఎలా తెలుసు? ఎప్పుడూ నాతో అనలేదు..." అని అడిగింది.

"నిన్ననే తెలిసింది నాకూ. రామనాథంగారు దుర్గాదేవి దర్శనానికి వచ్చి, దీన్ని కూడా చూశాడంట. 'చాలా బాగుంది వీలైతే మీరూ వెళ్ళండి' అని సలహా ఇచ్చాడు. సర్లే అని ఈరోజుకి లీవ్ పడేశాను." అని బదులిచ్చాడు ఆనంద్.

"ఇప్పుడే అర్థమైంది...దేవిగారిని ప్రసన్నం చేసుకోవడానికి కానుకలూ, ఆభరణాలూ కాదు కావలసిందని. మనసును రీఛార్జ్ చేయగలది ప్రకృతే అని..." అని ఆపి, అమృత కళ్ళలోకి చూస్తూ, "నిజంగా మొహం మొత్తిందంటావా..."అన్నాడు నవ్వుతూ.

తనూ నవ్వేస్తూ అతని భుజం వంపులో తలదాచుకుంది అమృత.

ముదిమి సమీపించినా వారి మనసుల్లో సదా అమృతానందమే. ★